క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



పార్టీ అధినేత జగన్‌ను కలిసిన పీలా వెంకటలక్ష్మి

సీతంపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ జోనల్ మహిళా ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి మంగళవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నేత సూచించినట్టు వెంకటలక్ష్మి తెలిపారు.

అలరించిన సంగీత విభావరి



గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: రసరాగ మాధురి వార్షికోత్సవం సందర్భంగా స్వరసాగర్ ఆర్కెస్ట్రా సహకారంతో మంగళవారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. సంస్థ ప్రతినిధులు ఎం.ఎస్.మాధవ్, స్వర సాగర్ సింగ్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు హుషారైన గీతాలతో ప్రేక్షకులను రంజింపజేశారు. గాయనీ గాయకులు పి.ఎస్.వి.ప్రసాద్, ప్రియ, సుధావాణి, హర్షిణి, సాత్విక, మాధురి, సుజాత, మెలోడి సత్యనారాయణ, ప్రభాకర్, భయ్యాశ్రీనివాస్, మహమ్మద్ ఖాన్ తదితరులు యుగళ గీతాలు ఆలపించి ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు.

డాక్టర్ కేఎల్ రావుకు ఘన నివాళులు



డాక్టర్ కేఎల్ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు, ఐఈఐ సభ్యులు

తాటిచెట్లపాలెం: ఇంజినీరింగ్ రంగంలో డాక్టర్ కేఎల్ రావు చేసిన సేవలు ఎనలేనివని ఐఈఐ నేషనల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఐ.సత్యనారాయణ కొనియాడారు. దొండపర్తిలోని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్(ఇండియా)–విశాఖపట్నం లోకల్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన డాక్టర్ కేఎల్ రావు జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డాక్టర్ కేఎల్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఈఐ విశాఖపట్నం లోకల్ సెంటర్ చైర్మన్ డాక్టర్ కేవీ రామమోహనరావు, సెక్రటరీ ప్రొ.డాక్టర్ చల్లా సురేష్, ఐఈఐ సభ్యులు పాల్గొన్నారు.

యూజీడీ లీక్‌తో అవస్థలు



అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో లీకవుతున్న మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో జీవీఎంసీ హైస్కూల్ సమీపంలో టి.ఆర్.రెసిడెన్సీ వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. యూజీడీ పైపులైన్‌లోని మురుగు, వ్యర్థాలు రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్నాయి. దీంతో మురుగు నుంచి వచ్చే దుర్వాసనతో స్థానికులు, అటుగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వాహనచోదకులు వారం రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. అపార్ట్‌మెంట్ ప్రవేశద్వారం వద్ద మురుగు ప్రవహిస్తుండటంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరకొర పని.. సమస్యల ప్రతిధ్వని

- చెట్ల కొమ్మలు కొట్టారు.. తొలగించడం మరిచారు
- రెండు వారాలవుతున్నా ఎక్కడి వ్యర్థాలు అక్కడే
- వాటి పైనే రోజువారీ చెత్త నెట్టేస్తున్న పారిశుధ్య కార్మికులు



సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ రాధాకృష్ణనగర్ మెయిన్‌రోడ్డుమీద కొట్టి వదిలేసిన చెట్ల కొమ్మలు



నక్కవానిపాలెం ఏఎంజీ హాస్పిటల్ పక్కనే కొట్టి వదిలేసిన చెట్ల కొమ్మలు



14వ వార్డు 251 సచివాలయం పక్కనే వదిలేసిన చెట్ల కొమ్మలు



45వ వార్డు నరసింహనగర్ జీవీఎంసీ పార్క్ పక్కనే సుమారు 10 రోజులుగా వదిలేసిన కొమ్మలు

తాటిచెట్లపాలెం: వాతావరణం మారినప్పుడల్లా దానికనుగుణంగా విద్యుత్ సిబ్బంది వైర్ల మీదకు వచ్చే చెట్ల కొమ్మలను తొలగిస్తుంటారు. ప్రత్యేకించి వర్షాకాలం ప్రారంభంలో ఈ చర్యలు చేపడుతుంటారు. ఇలా తొలగించిన కొమ్మలను రెండు, మూడు రోజుల్లోగా తరలించాలి. కానీ చాలా చోట్ల రెండు వారాలైనా ఇవి తొలగించకపోవడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నరసింహనగర్, రాధాకృష్ణనగర్, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్, నక్కవానిపాలెం ఇలా పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగించి సుమారు వారం నుండి రెండు వారాలకు పైగా అక్కడే గుట్టలుగా, కుప్పలుగా పేర్చి వదిలేశారు. గిరిప్రదక్షిణకు ముందు గిరిప్రదక్షిణ చేసే మార్గంలో ఆఘమేఘాల మీద చెట్ల కొమ్మలు నరికారు. ఇలా కొట్టేసిన కొమ్మలను కొన్ని చోట్ల తొలగించారు. కానీ చాలా చోట్ల ఇప్పటికీ అలానే ఉంచేశారు. ఇలా ఉన్న చెట్ల కొమ్మల వ్యర్థాలు ఎండిపోయి, రోడ్డంతా విస్తరిస్తున్నాయి. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది రోడ్లను శుభ్రం చేస్తున్నపుడు వచ్చిన చెత్తా చెదారాలను కూడా ఈ కొమ్మల గుట్టల్లోకి తోసేస్తున్నారని పలువురు తెలియజేస్తున్నారు. ఈ కొమ్మలు ఇలా గుట్టలుగా వదిలేయడం వల్ల విషకీటకాలు, పాములు చేరే ప్రమాదాలు ఉన్నాయని, చీకటి వేళల్లో ఇవి రోడ్ల మీదకు వస్తే ప్రమాదమని స్థానికుల భయపడుతున్నారు. అధికారులు స్పందించి త్వరగా ఈ ప్రాంతాలలో కొట్టించి వదిలేసిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



నరసింహనగర్ మెయిన్‌రోడ్ క్రౌన్ బేకరీ పక్కన 10 రోజులుగా వదిలేసిన చెట్ల కొమ్మలు

14వ వార్డులో..

జీవీఎంసీ 14వ వార్డు నరసింహనగర్ వెన్నెల గెస్ట్‌హౌస్ ఎదురుగా జీవీఎంసీ పార్క్‌లో సచివాలయం ఉంది. ఈ సచివాలయం ముందు, పక్కన చెట్ల కొమ్మలు నరికి రెండు వారాలైంది. అయినా ఇంకా వీటిని తొలగించలేదు. నార్త్ ఎక్స్‌టెన్షన్, రాధాకృష్ణనగర్ ప్రాంతంలో కూడా చాలా రోజుల నుండి ఇలానే కొమ్మలను వదిలేశారు.

24వ వార్డులో..

వార్డు పరిధి నక్కవానిపాలెం ఎంఆర్‌వో కార్యాలయం ఎదురుగా, ఏఎంజీ హాస్పిటల్ పక్కన గల భారీ చెట్టును తొలగించి చాలా కాలమైంది. కానీ ఈ కొమ్మలను ఇప్పటికీ తీసుకెళ్లలేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఈ వ్యర్థాలు కుళ్లిపోతున్నాయి.

45వ వార్డులో..

45వ వార్డు నరసింహనగర్‌లో జీవీఎంసీ పార్క్ సమీపంలో, క్రౌన్ బేకరీ పక్కన చెట్ల కొమ్మలు తొలగించి సుమారు 10 రోజులైంది. ఈ ప్రాంతంలో గిరిప్రదక్షిణకు ముందే చెట్ల కొమ్మల తొలగింపు చేపట్టారు. కానీ నేటికీ కొట్టిన కొమ్మలను తొలగించకుండా రోడ్డుపైనే వదిలేశారు. దీంతో స్థానికులే అప్పుడప్పుడు కొంచెం కొంచెం శుభ్రం చేసుకుంటున్నారు.

ఘాటెక్కిన మిర్చి

- కిలో రూ.70
- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120
- ధర నియంత్రించని మార్కెటింగ్ శాఖ



నరసింహనగర్ రైతుబజార్‌లో పచ్చిమిర్చి విక్రయాలు

సీతంపేట: పచ్చి మిర్చి ధర కొండెక్కి కూర్చుంది. రైతుబజార్‌లలో నిన్న మొన్నటి వరకు కిలో రూ.64 ఉండే మిర్చి రెండు రోజులుగా ధర పెరిగి అమాంతం రూ. 70 కు ఎగబాకింది. ఇక బహిరంగ మార్కెట్‌లో పావుకిలో రూ. 30 చొప్పున కిలో రూ. 120 వరకు ధర పలుకుతోంది. మిర్చి కొనకుండానే కంట నీరు తెప్పిస్తోందని మహిళలు అంటున్నారు. జూన్‌లో కురిసిన వర్షాలకు మిర్చి పంట పాడవడంతో నగరానికి మిర్చి దిగుమతులు తగ్గాయి. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక పోవడంతో హోల్‌సేల్ మార్కెట్‌లో ధరలు పెరిగాయి. దీంతో రైతుబజార్‌లో గురువారం కిలో రూ. 64కు విక్రయించగా, సోమ, మంగళవారాల్లో మరో ఆరు రూపాయలు పెరగడంతో కిలో రూ. 70 చొప్పున విక్రయించారు. నరసింహనగర్ రైతుబజార్‌లో సాధారణంగా రోజు వారి విక్రయాలకు 5 నుంచి 6 క్వింటాళ్లు అవసరం కాగా మూడు క్వింటాళ్లు మాత్రమే వచ్చినట్టు ఈవో కొండబాబు తెలిపారు. స్థానికంగా పచ్చి మిర్చి పంట అంతగా లేకపోవడం, రాయపూర్ నుంచి పచ్చి మిర్చి దిగుమతి తగ్గడంతో ధరలు పెరిగాయని, మరి కొద్ది రోజుల్లో ధరలు తగ్గుముఖం పడతాయని తెలిపారు.

ఆకాశవాణి సేవలు నిరుపమానం



మాట్లాడుతున్న డాక్టర్ బండి సత్యనారాయణ

దాబాగార్డెన్స్: అప్పటికీ.. ఇప్పటికీ ప్రజలకు చేరువగా సేవలందిస్తున్న సాధనం ఆకాశవాణి మాత్రమేనని, సాంకేతికంగా, సాంస్కృతికంగా ఆకాశవాణి (రేడియో) తన సేవలందిస్తూ కొనసాగుతోందని ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం విశ్రాంత వ్యాఖ్యాత, కవి డాక్టర్ బండి సత్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గరిమ సాంస్కృతిక వేదిక పుష్కరోత్సవ కార్యక్రమంలో భాగంగా 4వ సాహిత్య సమావేశం నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సిగ్నల్ అందని సముద్రం మధ్య భాగంలోనైనా మత్స్యకారులను ప్రమాదాల బారి నుంచి కాపాడగలిగేది, నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో కానీ, నేటి రక్షణ రంగానికి సంబంధించిన సైన్యం పహరాలో గానీ కేవలం రేడియో మాత్రమే శత శాతం సేవలు కచ్చితంగా అందించగలిగే సాధనమని పేర్కొన్నారు. ప్రముఖ కళాకారులు, సినిమా నటులు ఆ రోజుల్లో ఎదగడానికి ఆకాశవాణి దోహదపడిందని బండి తెలిపారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఇక్కడి రీడర్స్ అభివృద్ధికి, పోటీ పరీక్షలకు చాలా మేలు చేస్తాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని రీడర్లను కోరారు. ప్రయోజనకరమైన విషయాలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తున్న జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సిబ్బందిని, గరిమ సాంస్కృతిక వేదికను అభినందించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ ఎఫ్‌ఎం రేడియోల ద్వారా ఆకాశవాణి అందిస్తున్న సేవలు వివరించారు. గరిమ సాంస్కృతిక వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీఎస్ నరసింహం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పుష్కరోత్సవ సమన్వయకర్త సీహెచ్‌వీ సత్యనారాయణ, డీసీఎల్ డిప్యూటీ లైబ్రేరియన్ జి.తిరుమలకుమారి, రచయితలు డాక్టర కేవీఎస్ మూర్తి, బసు పోతన, గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని రాష్ట్రాలు వ్యతిరేకించిన స్మార్ట్‌మీటర్లు మనకెందుకు?

సీపీఎం విశాఖ జిల్లా కమిటీ

దాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారానికి వ్యతిరేకంగా సీపీఎం విశాఖ జిల్లా కమిటీ మంగళవారం సాయంత్రం నగరంలోని సింగ్ హోటల్ జంక్షన్ వద్ద దీపం బుడ్లు, లాంతర్లతో వినూత్న రీతిన నిరసన చేపట్టింది. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను ఉల్లంఘించి, ఈ రోజు విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇంటింటా బిగించడానికి సిద్ధపడ్డాయన్నారు. ఆ రోజు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడిన నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత అవే స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధపడ్డారని, ఈ రోజు కేవలం అదానీ కంపెనీకి లాభం చేకూర్చడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని దుయ్యబట్టారు. అదానీ రూపొందించిన స్మార్ట్ మీటర్ల వల్ల బిల్లులు భారీగా పెరుగుతున్నాయని, దీనిని అన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో మీటర్లు మార్చమని, ఉన్న వాటిని కొనసాగిస్తామని తేల్చి చెప్పారని, కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వాటిని బిగించడానికి సిద్ధ పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ఒకే రోజులో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేర్వేరుగా చార్జీలు నిర్ణయించబడతాయని, ప్రజలపై కోట్లాది రూపాయల భారం పడే ఈ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, పాత మీటర్లనే కొనసాగించాలని, ప్రీపెయిడ్ మీటర్లతో కూడా దోచుకునే అవకాశం ఉండడంతో వాటిని కూడా ఉపసంహరించుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ ఏడాది విశాఖలోని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు రూ.1200 కోట్లు మిగులు ఉన్నా, యూనిట్‌కు రూ.40 పైసలు చొప్పున వసూలు చేసి, ప్రజలపై రూ.2700 కోట్ల భారం మోపారన్నారు. వీటికి వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేస్తుందని, ప్రజలంతా స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.గంగారావు, బి.పద్మ, కె.ఎం.శ్రీనివాస్, పి.మణి, బి.జగన్, వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విజన్ ట్రీ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం దరి దాలిరాజు సూపర్‌మార్కెట్ సమీపంలో గల వివేకానంద ఆస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజన్ ట్రీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కేటరాక్ట్, గ్లకోమా, రెటీనా వంటి పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి విజన్ ట్రీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు, ఈ శిబిరంలో విజన్ ట్రీ ఆస్పత్రి వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్‌కు సత్కారం



ఎంవీ రాజశేఖర్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఈవో రాజగోపాల్‌రెడ్డి

దాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవంలో సేవలందించిన పలు సంస్థలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన పలువురికి మంగళవారం ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. సాంస్కృతిక కార్యకరమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ సేవలను గుర్తిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పి.జగన్నాథాచార్యులు, సిబ్బంది ప్రసాద్, శ్రీరామ్, శ్రీహరి సేవకులు ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

పూల్ కలాసీల సమస్య పరిష్కారానికి హామీ

దాబాగార్డెన్స్: పోర్టు పూల్ కలాసీల సమస్య త్వరలో పరిష్కరిస్తానని కేంద్ర పోర్టు, షిప్పింగ్ వాటర్ వేస్ కార్యదర్శి రామచంద్రన్ హామీ ఇచ్చారని పూల్ కలాసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అప్పారావు, కార్యదర్శి చింతపల్లి పోతురాజు, ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్ తెలిపారు. విశాఖ విచ్చేసిన ఆయనను కలిసి పూల్ కలాసీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిపత్రం అందజేశారు. గత 28 ఏళ్లుగా పోర్టులో వివిధ విభాగాల్లో పని చేస్తూ, చాలీ చాలని జీతంతో కొట్టుమిట్టాడుతున్నామని, టైం స్కేల్ వర్తింపజేయమని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించాలని కోరినట్టు తెలిపారు. పూల్ కలాసీల పేరిట కంప్యూటర్ ఆపరేటర్, క్రేన్ ఆపరేటర్, పంప్ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డ్, క్లర్క్, ఎలక్ట్రీషియన్లుగా పని చేస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతం లేకుండా పూల్ కలాసీల జీవితాలు ముగిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది పూల్ కలాసీలను పర్మినెంట్ చేసి, మిగిలిన 530 మందిని పర్మినెంట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ఫలితంగా చాలీ చాలని జీతాలతో అవస్థలు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని పూల్ కలాసీలు వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో వాసుపల్లి రాము, కె.శ్రీనివాస్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వనితా వాకర్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం



వనితావాకర్స్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ మహిళలు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి అన్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మంగళవారం నిర్వహించిన వనితా వాకర్స్ క్లబ్ 23వ వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు. మహిళల్లో ఆరోగ్యం, నడక ప్రాధాన్యతపై అవగాహన కల్పించడంలో వనితా వాకర్స్ అందరికన్నా ముందున్నారన్నారు. ఎంజీఎఫ్ సభ్యులను చేర్పించి వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ అభివృద్ధికి సహకారం అందిస్తున్నారని ప్రశంసించారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101గవర్నర్ కె.ద్వారకానాథ్ మాట్లాడుతూ వనితా వాకర్స్ మహిళా సభ్యులు సమన్వయంతో పని చేస్తూ ఉత్తమ క్లబ్‌గా పేరు తెచ్చుకున్నారని, ఈ పేరును కొనసాగించే విధంగా మరింత కృషి చేయాలని కోరారు. వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పాందూరు ప్రభావతి మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు వేసవిలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక బాలిక కూచిపూడి నృత్యం ఆహూతులను అలరించింది. మహిళలకు లక్కీడిప్ ద్వారా బహుమతులు అందించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఆర్‌సీ–5 ఉప్పలపాటి శుభ, అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం, వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వనితా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు వి.జయప్రభాశర్మ, జె.ఉమాదేవి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

27న గవర విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ

దరఖాస్తు గడువు ఈ నెల 19



కరపత్రికను ఆవిష్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

తాటిచెట్లపాలెం: పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గవర విద్యార్థులకు కేంద్ర గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న స్కాలర్‌షిప్స్ అందజేయనున్నట్లు సంఘం అధ్యక్షుడు బుద్ద శివాజీ తెలిపారు. ఆ రోజు ఉదయం 9గంటలకు తాటిచెట్లపాలెం ఆశీర్వాద్ కల్యాణమండపంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రైల్వేన్యూకాలనీలోని కేంద్ర గౌరీ సేవా సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టెన్త్, ఇంటర్మీడియట్‌లలో 80శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారితో పాటు పాలిసెట్, ఎంసెట్, నీట్, జేఈఈ తదితర ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి మొత్తం 27 విభాగాలలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఏ ఆధారం లేని 10మంది గవర విద్యార్థులను ఎంపిక చేసి, వారికి 10వేల చొప్పున ఉపకార వేతనాలు అందిస్తామన్నారు. ఇంటర్ పాసైన పేద గవర విద్యార్థులను మూడేళ్లపాటు ఉచితంగా డిగ్రీ చదివించేందుకు శ్రీ గౌరీ డిగ్రీ కళాశాల ముందుకు రావడం హర్షణీయమన్నారు. ప్రోత్సాహక బహుమతుల కోసం ఈ నెల 19వ తేదీలోగా రైల్వే న్యూకాలనీలోని కేంద్ర గౌరీ సేవా సంఘం కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. కార్యక్రమ కరపత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు, కోశాధికారి కేవీకే శ్రీనివాసరావు, మళ్ల బలరాం, వేగి సత్యనారాయణ, పి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారానికి విద్యుత్ కార్మికుల వినతి




ఈపీడీసీఎల్ సీజీఎం సుమన్ కల్యాణికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

తాటిచెట్లపాలెం: జేఎల్‌ఎం గ్రేడ్–2 ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ సంస్థలో పూర్తిగా విలీనం చేసి, అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని, ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ ప్రకారం టైం స్కేల్ వర్తింపజేయాలని కోరుతూ ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్‌డీ) డి. సుమన్ కళ్యాణికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా వినతిపత్రాలను రాష్ట్ర వ్యాప్తంగా సేకరిస్తామని, ప్రాణాలకు తెగించి పని చేస్తున్న జేఎల్‌ఎం గ్రేడ్–2లకు న్యాయం చేయాలని వీరు కోరారు. ఈ విషయంలో న్యాయం చేసేలా ప్రయత్నం చేస్తానని సీజీఎం హామీ ఇచ్చినట్లు వీరు తెలిపారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. సత్యారావు, పి. శ్రీనివాసరావు, పి. చంద్రశేఖర్, గ్రేడ్2 జేఎల్‌ఎం నాయకులు ఎస్. అప్పలరాజు, కె. శంకర్రావు, ఎస్. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా లలితాదేవి



కూరగాయలతో అలంకరించిన లలిత అమ్మవారి మండపం



శాకంబరి అలంకారంలో లలితాదేవి



కూరగాయల అలంకరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి

సీతంపేట: ఆషాఢమాసం, బహుళ పంచమి సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలోని లలితాకామేశ్వరి అమ్మవారు మంగళవారం శాకంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని, ఆలయ మండపాన్ని బీర, బెండ, ఆనప, క్యాప్సికం, టమాటా, వంగ, దొండ, దోస, బీట్‌రూట్ వంటి సుమారు 15 రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. పీఠంలో గల ఉప ఆలయాలలో దేవతామూర్తులను సైతం కూరగాయలతో అలంకరించారు. ప్రత్యంగిరా దేవి, కాళీకాలభైరవులు, వారాహిదేవి, మణిద్వీపంలో శ్రీచక్రం, విజయ గణపతి, కామేశ్వరుడు, కల్యాణ వేంకటేశ్వరస్వామిని కూరగాయలతో అలంకరించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ అమ్మవారితో పాటు పీఠంలోని దేవతామూర్తులను సుమారు 450 కిలోల కూరగాయలు, పండ్లతో అలంకరించినట్లు చెప్పారు. ఈ కూరగాయలతో గురువారం కదంబం వండి, ఆ రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తామని తెలిపారు. భక్తులు పాల్గొని, కదంబ ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.